

ఆటో కార్మికులకు..
చంద్రన్న భరోసా
- ప్రతి ఏటా రూ.15వేల ఆర్థిక సాయం
- దసరాకు పథకం ప్రారంభం
- ఉమ్మడి కడప జిల్లాలో 30వేల మందికి పైగా లబ్ధి
- ప్రభుత్వంపై రూ.45కోట్ల ఆర్థిక భారం

7

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండించిన ఉల్లిని రైతులకు నష్టం కలగకుండా ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇన్‌చార్జి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి ఉల్లి పంటను నేరుగా ప్రభుత్వం కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి రైతులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో మైదుకూరు, కమలాపురంలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఉల్లి పంట కోత దశలో ఉందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట దిగుబడిని ఎలా సంరక్షించుకోవాలి? ఒక్కసారిగా అధిక పంట దిగుబడిని ఎలా మార్కెటింగ్ చేయాలి? అనే అంశాలపై రైతులు, ట్రేడర్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఏడీ అజాద్ వలి పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి పెట్టాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెడితే భూ సమస్యలు 100 శాతం పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన పిర్యాదులపై సీఎంవో కార్యాలయం నుంచి అందిన కాల్స్ మేరకు ఆయా డివిజన్ల ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్ఐలు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలు, అసైన్డ్ భూముల పరిష్కారంలో ఎక్కువగా పిర్యాదులు అందుతున్నాయన్నారు. పిర్యాదులకు సంబంధిత అధికారులు సరైన పరిష్కారాలు చూపడం లేదన్నారు. తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పిర్యాదుల పట్ల విచారణ చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల నాటికి సమస్యలు పెండింగ్ లేకుండా జీరో శాతం అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ పిర్యాదుల పరిష్కార విషయంలో క్షేత్రస్థాయి విజిట్‌కు ప్రణాళికతో వెళ్లాలని, అలాగే ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మురళీకృష్ణ, రెవెన్యూ శాఖలకు సంబంధించి డివిజన్, మండల స్థాయిలో అధికారులు పాల్గొన్నారు.

కుందూలో భారీగా వరదనీరు



కుందూలో భారీగా వరద నీరు ప్రవహిస్తున్న దృశ్యం

రాజుపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, కడప జిల్లాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో శుక్రవారం సాయంత్రం కుందూలో వరదనీరు భారీగా ప్రవహిస్తోంది. దాదాపు 30వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ షేక్షావలి తెలిపారు. దీంతో వెల్లాల వద్ద ఉన్న కాజ్‌వేపై అక్కడి ప్రజలు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు నీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రిమ్స్ వైద్యులపై విచారణకు మార్గం సుగమం

7

రూ. 6కోట్ల స్థలానికి స్కెచ్

- నకిలీ పత్రాలతో కాజేసేయత్నం
- అద్దదారుల్లో అమ్మకానికి
- అవాక్కయిన అధికార యంత్రాంగం

కొందరు కష్టపడి సంపాదించి ఒక్కో మెట్టు పైకి ఎక్కుతుంటారు. మరికొందరు కోట్లాది రూపాయలు గడించేందుకు అడ్డదారులు తొక్కుతుంటారు. ఒకతను ఏకంగా రూ.6 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలానికి టెండరు పెట్టాడు. పక్కా స్కెచ్‌తో కొట్టేసే ప్రయత్నం చేశాడు. ఈ వ్యవహారం బయటికి రావడంతో అధికారులు హడావిడిగా ఆ భూమిని స్వాధీనం చేసుకునే యత్నం చేశారు. ఇది ఎక్కడో కాదు.. జిల్లా కేంద్రం కడపలో చోటు చేసుకోవడం విశేషం.



ఆక్రమణకు గురవుతున్న యువజన సర్వీసుల శాఖ గోడౌన్, అప్పట్లో దివంగత సీఎం ఆవిష్కరించిన శిలాఫలకం (వృత్తంలో)

(కడప-ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని 424 ఎకరాల్లో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసింది. మొత్తం 231 ప్లాట్లను కేటాయించింది. దీని సమీపంలోనే ఆర్టీసీ గ్యారేజీతో పాటు ఇతర పరిశ్రమలున్నాయి. 1997లో యువజన సర్వీసుల శాఖ ఏపీఐఐసీకి రూ.2.5 లక్షలు చెల్లించింది. దీంతో ఆ శాఖకు ఇక్కడ 173, 174, 175, 176, 178 ప్లాట్లను కేటాయించింది. అప్పట్లో సిండికేట్ బ్యాంకు సహకారంతో నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. ట్రైనింగ్‌కు వచ్చే వారికి హాస్టలు వసతి కూడా ఉండేది. దివంగత రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. కొన్నేళ్లపాటు నిరాటంకంగా యువజన సర్వీసులశాఖ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తూ వచ్చారు. అయితే యువజన సర్వీసుల శాఖ ఇప్పుడు అక్కడి నుంచి ట్రైనింగ్‌ను నగర శివారులోకి మార్చుకుంది. అప్పటి నుంచి గోడౌన్లు ఖాళీగా ఉండడంతో కొన్నాళ్ల పాటు వాటిని రేషన్ బియ్యం గోడౌన్లుగా ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం అవి ఖాళీగానే ఉన్నాయి.



ఇండస్ట్రియల్ పార్కులో యువజన సర్వీసులశాఖ గోడౌన్లు

రూ.6కోట్ల స్థలానికి టెండరు

పరిశ్రమల శాఖ ఇక్కడ అప్పట్లో మొత్తం 424.06 ఎకరాల్లో లేఅవుట్ వేసింది. 42.40 ఎకరాలు ఓపెన్ స్పేస్, రోడ్ల కోసం 71.37 ఎకరాలు కేటాయించి మొత్తం 231 ప్లాట్లు కేటాయించింది. ఇది అప్రూవల్ లేఅవుట్ కావడంతో రోడ్లు ఇతర వసతులున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ యువజన సర్వీసుల శాఖకు ఇచ్చిన 6 ప్లాట్లపై కొందరు కన్నేశారు. ఈ ఆరు ప్లాట్లలోని గోడౌన్లు రెండు ఎకరాల్లో ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇవి ఖాళీగా ఉండడం, ఈ స్థలం దాదాపు రూ.6కోట్ల విలువ చేస్తుండటంతో.. వాటిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇవి మావే అంటూ వాటిని ఇప్పుడు అమ్మకానికి పెట్టారు. ఈ విషయం బయటికి పొక్కడంతో ఇటు ఏపీఐఐసీ, అటు యువజన సర్వీసుల శాఖ అలర్ట్ అయ్యాయి. ఈ భూముల గురించి ఆరా తీయగా, 1997లోనే ఏపీఐఐసీ జిల్లా పరిషత్ ద్వారా యువజన సర్వీసులశాఖకు ఆరు ప్లాట్లను కేటాయించిందని, ఇది ప్రభుత్వ భూమి అని తేలింది. దీనిని ఎలా కాజేస్తున్నారో అర్థం కాక అధికారులు తలలు పట్టుకున్నారు. అయితే కబ్జాదారులు కాజేసేందుకు వేసిన పక్కా స్కెచ్ చూసి అధికారులే ఔరా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఐఐసీ నిర్ణయించిన ప్రభుత్వ ధర ప్రకారం అక్కడ ప్రస్తుతం ఎకరం సుమారు రూ.96లక్షలు ఉంది. మార్కెట్‌లో అయితే సుమారు రూ.3కోట్లు ఉంది. 6 ప్లాట్లు ఉన్న రెండెకరాల స్థలం రూ.6 కోట్ల దాకా ఉంటుందని చెబుతున్నారు. నియోజకవర్గానికి ఓ మినీ పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది, ఈ నేపథ్యంలో ఇక్కడ ఖాళీగా ఉన్న ఈ భూములను ఏపీఐఐసీకి కేటాయించాల్సిందిగా ఉన్నతాధికారులకు ఏపీఐఐసీ అధికారులు లేఖ రాశారు. అయితే ఈ స్థలానికే స్పాట్ పెట్టడం చూసి అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

గండికోట.. కళకళ

- వరుసగా ఆరోసారి 26 టీఎంసీల గరిష్ఠ నీటిమట్టానికి చేరిక

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరువుకు మారుపేరైన రాయలసీమలో కొండాపురం మండలంలోని పెన్నానదిపై నిర్మించిన గండికోట ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు. 26 టీఎంసీల గరిష్ఠ నీటిమట్టానికి వరుసగా ఆరోసారి చేరుకోవడం ద్వారా ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు కొత్త ఆశలు నింపుతోంది. ఈ ప్రాజెక్టు కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

రైతులకు వెన్నుదన్ను..

గాలేరు-నగరిలో అంతర్భాగమైన ఈ ప్రాజెక్టు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు నుంచి అనుబంధంగా మైలవరం, చిత్రావతి, పైడిపాళెం, వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టులతో పాటు పలు ఎత్తిపోతల పథకాలకు నీరందిస్తూ కరువుతో అల్లాడుతున్న జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటోంది. ఈ ప్రాజెక్టులు నింపడం ద్వారా సుమారు 2 లక్షల ఎకరాలకు ఆయకట్టుకు ఊపిరి పోస్తోంది. వ్యవసాయం పెంపొందడంతో పాటు, చేపల పెంపకం కూడా ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ నీటి లభ్యత పెరగడంతో బోరు బావులలో కూడా నీరు సమృద్ధిగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జలవనరులశాఖ అధికారులు నీటి నిల్వలను పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాలకు క్రమబద్ధంగా నీటిని విడుదల చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



నిండుకుండలా ఉన్న గండికోట ప్రాజెక్టు

మైలవరం జలాశయానికి నీరు విడుదల

గండికోట ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటి మట్టం చేరుకోవడంలో శుక్రవారం ఉదయం నుంచి మైలవరం జలాశయానికి 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 4,500 క్యూసె క్కులు ఉందన్నారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా చిత్రావతి నదుల ద్వారా వచ్చే నీరు 4,900 క్యూసెక్కులు ఉందన్నారు. కాగా సీబీ ఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

వరుసగా ఆరుసార్లు నింపడం రికార్డు

2020 డిసెంబరు 21న మొదటిసారి గండికోట ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీళ్లు నిల్వ ఉంచాం. అప్పటి నుంచి వరుసగా ఆరోసారి 26 టీఎంసీల నీరు నిల్వ చేయడం రికార్డు. వరుణుడు కరుణించడం, కృష్ణా వరద జలాలను ఒడిసి పట్టడంలో ప్రభుత్వం ముందు చూపు, అధికారుల సమిష్టి కృషివల్ల ఇది సాధ్యమయింది. 26 టీఎంసీల తర్వాత వచ్చే నీటిని మైలవరం జలాశయానికి, మిగిలిన అనుబంధ ప్రాజెక్టు అవసరాలకు పంపుతాం.

- ఉమామహేశ్వర్లు, ఈఈ, జీఎన్ఎస్ఎస్, కడప

నేడు జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని తెలిపారు. జిల్లాలోని ఆయా కోర్టులలో కేసుల పరిష్కారానికి బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో జిల్లా కోర్టులో 4, ప్రొద్దుటూరు కోర్టులో 3, రాజంపేట కోర్టులో 3, రాయచోటి కోర్టులలో 3, బద్వేలు కోర్టులో 2, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్‌ఆదాలత్ జరుగుతుందన్నారు. కక్షిదారులు హాజరై తమ కేసులను స్నేహపూరిత వాతావరణంలో రాజీచేసుకుని సత్వర న్యాయం పొందాలన్నారు.

ఎగ్జిబిషన్ వేలం ద్వారా రూ.1.91 కోట్ల ఆదాయం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో ఏర్పాటయ్యే ఎగ్జిబిషన్ కోసం మున్సిపల్ హైస్కూలు మైదానాన్ని 45 రోజులు లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించగా రూ.1.91 కోట్ల ఆదాయం సమకూరింది. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో సర్కారు వారి పాటగా రూ.1.50 కోట్లతో ప్రారంభించగా రూ.1,91,44,000 బాక్స్ టెండర్ వేసి నక్కా వెంకట శివకుమార్ అనే వ్యక్తి లీజును దక్కించుకున్నారు. గత ఏడాది రూ.1.75 కోట్లకు పాడగా ఈ ఏడాది రూ.16.44 లక్షలు అదనంగా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది. రూ.1.91 కోట్లకు 18 శాతం అదనంగా జీఎస్టీ కూడా కాంట్రాక్టర్ చెల్లించవలసి ఉంటుంది. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌వో డేనియల్ జోసఫ్, ఆర్ఐ రమేశ్‌బాబు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా..?

- ప్రైవేట్ డీలర్ల వద్దకు ఎగబడుతున్న రైతులు
- పలుచోట్ల తోపులాట.. ఘర్షణ



దువ్వూరు : మన గ్రోమోర్ వద్ద యూరియా కోసం ఎగబడ్డ రైతులు

ప్రొద్దుటూరు రూరల్ / దువ్వూరు / చాపాడు / రాజుపాళెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాభావంతో ఖరీఫ్‌లో చాలా పొలాలు బీళ్లుగా ఉండటం.. రెండురోజులుగా వానలు పెద్ద ఎత్తున కురుస్తుండటంతో రైతులు యూరియాకోసం ఎగబడుతున్నారు. అయితే డిమాండ్ మేరకు యూరియా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు డీలర్ల వద్ద రైతులు బారులు తీరుతున్నారు.

ప్రొద్దుటూరు మండల పరిధిలోని అన్నదాతల కోసం శుక్రవారం 16.6 టన్నుల యూరియా సరఫరా అయింది. శుక్రవారం ఉదయం నుంచి ప్రైవేటు ఎరువుల డీలర్ దుకాణాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్ మధ్యాహ్నం వరకు రైతన్నలకు దగ్గరుండి యూరియాను పంపిణీ చేయించారు. రైతులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున డీలర్ దుకాణాల వద్ద బారులుతీరారు. పాస్‌బుక్కులు, ఆధార్‌కార్డులు తీసుకుని క్యూ కట్టారు. మహిళా రైతులు కూడా యూరియా కోసం దుకాణాల వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పంపిణీ సవ్యంగా సాగేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంపిణీపై పర్యవేక్షించారు. పోలీసు అధికారులు దుకాణాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ప్రతి మండలానికి యూరియా సరఫరా జరిగిందని, ప్రతి ఒక్కరికి యూరియా అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

- దువ్వూరులో శుక్రవారం ఉదయమే యూరియా పంపిణీ కేంద్రాల వద్దకు రైతులు వచ్చారు. మహిళా రైతులు సైతం ఇక్కడకు వచ్చారు. పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు కేంద్రాల వద్దకు వచ్చి సజావుగా పంపిణీ జరిగేలా చూశారు.
- చాపాడులోని మస్తాన్‌వల్లి పర్టిలైజర్ దుకాణం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. ఒకరిని ఒకరు దూషించుకున్నారు. సోమాపురం గ్రామ సచివాలయం వద్ద పోలీసు బందోబస్తుతో యూరియాను పంపిణీ చేశారు.
- రాజుపాలెం మండలంలోని రాజుపాలెం, కొరపాడు, టంగుటూరు గ్రామాల్లో యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున రావడంతో క్యూలో ఉన్న వారికి కూపన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు. అయితే యూరియా ఇంకా కావాలని రైతులు డిమాండ్ చేశారు. వర్షం పడడంతో జొన్న, పత్తి, వరి తదితర పంటలకు యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.



ప్రొద్దుటూరులో ప్రైవేటు డీలర్ దుకాణాల వద్ద బారులు తీరిన రైతన్నలు

ఎరువుల దుకాణం తనిఖీ

- 6ఏ కేసు నమోదు



గోడౌన్‌లో బస్తాలను లెక్కిస్తున్న జేడీఏ, సంబంధిత అధికారులు

దువ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని మహా నందీశ్వర ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని శుక్రవారం జేడీఏ చంద్రనాయక్, ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో అమర్‌నాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. నిర్వాహకులతో కలిసి ఎరువులు నిలువ ఉంచిన ప్రాంతానికి వీరు వెళ్లారు. నిలువ కన్నా తక్కువ బస్తాలు ఉన్నట్లు గమనించారు. అనంతరం జేడీఏ చంద్రనాయక్ మాట్లాడుతూ ఇక్కడ ఎరువుల దుకాణానికి 200 బస్తాల యూరియా కేటాయించగా పరిశీలనలో 173 బస్తాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. 27 బస్తాలు యూరియా తేడా ఉందని తెలిపారు. ఈ మేరకు సదరు దుకాణంపై 6ఏ కేసు నమోదు చేస్తున్నట్లు వివరించారు.

పాత చీరలే.. కంచెలుగా..!

● పొలం చుట్టూ పాత చీరలు, మెష్‌లు కట్టిన రైతులు ● వింత శబ్దాలు చేసే మైక్‌ల ఏర్పాటు ● అడవిపందుల నుంచి పంటను కాపాడుకునే పాట్లు

పచ్చని పంట పొలాలు. ఆ పొలాల చుట్టూ కంచె వేసినట్లుగా రంగురంగుల చీరలు.. మధ్యలో అక్కడక్కడా విచిత్రమైన శబ్దాలు చేసే మైకులు.. అందమైన హీరోయిన్ల అర్ధనగ్న ఫ్లెక్సీలు. ఎందుకు రైతులు ఇలా చేస్తున్నారని అనుకుంటున్నారా..! కష్టాన్ని నమ్ముకుని స్వేదాన్ని చిందించే రైతులు.. పంటలను అడవిపందుల బారి నుంచి కాపాడుకునేందుకు ఇలా తమకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుంటున్నారు.



చేను మధ్యలో చెట్టుకు ఏర్పాటు చేసిన మైకు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెలో రైతులు ఎక్కువగా వేరుశెనగ, వరి, మొక్కజొన్న సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశెనగ కాయలు బుడ్డల దశలో ఉన్నాయి. అయితే ఈ పొలాలు ఎక్కువగా అడవికి సమీపంలో ఉండటంతో అడవిపందుల బెడద ఎక్కువగా ఉంటోంది. రాత్రి వేళల్లో అడవిపందులు గుంపులు గుంపులుగా పంట పొలాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. వేరుశెనగ, మొక్కజొన్న.. పంట ఏదైనా తీరని నష్టాన్ని మిగిలిస్తున్నాయి. విత్తు విత్తినప్పటి నుంచి పంట చేతికొచ్చి మార్కెట్‌కు తరలించే వరకు కంటిమీద కునుకు లేకుండా కాపాలా కాస్తున్నా.. ఏదో ఒక సమయంలో అడవి పందులు పంటలపై పడి నష్టపరచడం రైతుకు తలనొప్పిగా మారింది. దీంతో బాధిత రైతులు అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు రకాల పద్ధతులు అవలంబిస్తున్నారు. పొలాల చుట్టూ సుమారు మూడు అడుగుల మేర ఎత్తుతో రంగు రంగుల పాత చీరలు, నర్సరీ మెష్‌లు, వలలు వంటివి కడుతున్నారు. మరి కొంతమంది రైతులు వినూత్నంగా ఆలోచించి అడవిపందులు పంట పొలాల్లోకి ప్రవేశించకుండా బ్యాటరీ మైక్‌లు ఏర్పాటు చేసి వింత శబ్దాలతో పంటలను రక్షించుకుంటున్నారు.

చేను మధ్యలో మైక్‌లు..

పలువురు రైతులు వినూత్నంగా ఆలోచించి పంటలను రక్షించుకోవడానికి మనుషులు, కుక్కల అరుపులు వచ్చే బ్యాటరీ మైక్‌లను చేలల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మైక్‌ను తంబళ్లపల్లె, మదనపల్లె పట్టణాల నుంచి రూ.500 నుంచి రూ.800ల వరకు వెచ్చించి తెచ్చుకున్నట్లు రైతులు చెబుతున్నారు. వీటిలో మెమరీ కార్డు ఆప్షన్ ఉంటుంది. మెమరీ కార్డులో మనిషి అరిచినట్లుగా హై..హై.. హుడ్..హుడ్ అని.. కుక్కలు అరిచినట్లుగా భౌ..భౌ.. అనే శబ్దాలు రికార్డింగై ఉంటాయి. పగలంతా ఇంటి వద్ద మైక్‌కు చార్జింగ్ పెట్టి.. రాత్రి వేళ పంట మధ్యలో ఓ చోట చెట్టుకు కాని, కర్రకు కాని మైక్‌ను ఏర్పాటు చేసి ఆన్ చేస్తారు. అచ్చం మనిషి పొలంలో అరిచినట్టుగానే రాత్రంతా మైక్ శబ్దాలు చేస్తూ ఉంటుంది. దీంతో అడవి జంతువులు పొలంలో మనుషులు ఉన్నారనుకుని రావడానికి భయపడుతున్నాయని రైతులు చెపుతున్నారు.

టమోటా తోటలో హీరోయిన్ల ఫ్లెక్సీలు

టమోటా పంటను కష్టపడి సాగు చేసిన రైతులు ఇతరుల చూపు పంటపై పడకుండా తోటలో అక్కడక్కడా హీరోయిన్ల అర్ధనగ్న ఫ్లెక్సీలు పెట్టి దృష్టిని మళ్లిస్తున్నారు. టమోటా ధర ఎక్కువగా ఉన్నపుడు రోడ్ల మీద వెళ్లే బాటసారుల కన్ను తోటపై పడి దిగుబడి తగ్గే అవకాశం ఉండటంతో తోటలో హీరోయిన్ల ఫ్లెక్సీలు పెడుతున్నామని, దీంతో ఇతరుల కన్ను తోటపై పడకుండా ఫ్లెక్సీల మీద పడుతుందని రైతులు చెపుతున్నారు.

పందులు ధ్వంసం చేస్తున్నాయి



మూడు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వేరుశెనగ సాగు చేశాను. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండటంతో ముందు జాగ్రత్తగా పాత చీరలు కొనుక్కొచ్చి చేను చుట్టూ కట్టాను. ప్రస్తుతం బుడ్డలు పట్టగా అడవి పందుల బెడద ఎక్కువైంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా వచ్చి పంట మీద పడుతున్నాయి.

- ఆంజినేయులు, రైతు, తంబళ్లపల్లె

చేనుచుట్టూ చీరలు కట్టాము



రెండు ఎకరాల్లో వేరుశెనగ సాగు చేశాను. ప్రస్తుతం కాయలు బుడ్డలు పడుతున్నాయి. అడవిపందుల బెడద ఉండటంతో చేను చుట్టూ నాలుగు అడుగుల మేర ఎత్తుతో పాత చీరలు కట్టించాను. అయినా మేము లేని సమయంలో ఏదో మూల నుంచి వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి.

- సతీశ్, వేరుశెనగ రైతు, తంబళ్లపల్లె



వేరుశెనగ పంట రక్షణకు కంచెలా చేను చుట్టూరా కట్టిన రంగు రంగుల పాత చీరలు

జిల్లా ఆస్పత్రిని తనిఖీ



వైద్యురాలితో మాట్లాడుతున్న ఎన్టీఆర్ వైద్యాధికారి లోకవర్ధన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్ప త్రిని ఎన్టీఆర్ వైద్య జిల్లా అధి కారి డాక్టర్ లోక వర్ధన్ శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఆయన ఆస్పత్రి లోని అంబులెన్స్‌లను, ఎన్టీఆర్ వైద్య కేంద్రంలో రికార్డులను పరిశీ లించారు. అత్యవసర విభాగంలో డాక్టర్స్‌తో కలిసి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి రెఫర్లు ఎక్కువ వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిం దన్నారు. అంబులెన్స్‌లు మండల పరిధిలో అత్యవసర కేసులకు అందుబాటులో లేకుండా ఇతర జిల్లాలైన తిరుపతి, నెల్లూరుకు పంపడం సరికాదన్నారు. రెఫర్లతో నిరుపేద రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇక్కడ డాక్టర్లు, నర్సులు ప్రైవేట్ స్కానింగ్‌లకు, ప్రైవేట్ ఆస్పత్రులకు కేసులను పంపి మామూళ్లు తీసుకుంటున్న సంఘటనలు ఉన్నాయని, అలా జరిపిన లావాదేవీలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెఫర్లు కారణంగా ప్రైవేట్ అంబులెన్స్‌కు గిరాకీ పట్టివ్వడమే కాక ఇది వ్యాపారంగా నిర్వహిస్తున్నారని చెప్పారు.

రామాలయం నిర్మాణంపై వివాదం

● పోలీసుస్టేషన్‌కు తరలివచ్చిన గ్రామస్థులు



తాలుకా పోలీసుస్టేషన్‌కు విచ్చేసిన పోతబోలు గ్రామస్థులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పోతబోలు హరిజన వాడలో రామస్వామి పాత గుడిని తొలగించి నూతన ఆలయం నిర్మాణానికి పనులు చేపడుతుండగా నారాయణప్ప, ఆయన భార్య నాగరత్నమ్మ స్థలం తమదని పనులు అడ్డుకున్నారు. దీనిపై ఆగ్ర హించిన గ్రామస్థులు నారాయణప్ప, నాగరత్నమ్మ దంపతులపై దాడిచేసి గాయపర్చినట్లు తాలుకా పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. హరిజనవాడలో టీటీడీ ఆధ్వర్యంలో రామాలయం నిర్మాణా నికి రూ.45 లక్షలు నిధులు మంజూరయ్యాని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామస్థులంతా కలిసి గ్రామంలో మరికొంత సొమ్మును చందాలతో నూతన ఆలయం నిర్మాణానికి పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవ డంతో తమపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తమపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని తెలుసుకున్న పోతబోలు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తాలుకా పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివ రాలు సేకరించారు. ఆలయ నిర్మాణానికి అనుమతులు ఉండడంతో నిర్మాణ సమయంలో ఎవరూ గొడవ పడరాదని సూచించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని సీఐ తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

● వాటర్ హీటర్ పట్టుకోవడంతో గాయాలు

ములకలచెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నీటిని వేడి చేసే కరెంటు వాటర్ హీటర్‌ను పట్టుకోవడంతో వెంకటలక్ష్మమ్మ గాయపడింది. పోలీసుల కథనం మేరకు... కాలువపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె వాసి బయారెడ్డి భార్య వెంకటలక్ష్మమ్మ నెల రోజుల కిందట బెంగళూరు నుంచి బస్సులో వస్తుండగా ఎగిరిపడి నడుము విరిగి మంచానికే పరిమితమైంది. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో నీటిని వేడి చేసేందుకు బకెట్‌లో ఉంచిన వాటర్ హీటర్‌ను పట్టుకుంది. దీంతో వృద్ధురాలి రెండు చేతులు కాలి తీవ్రంగా గాయపడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఉమాదేవి, షామీర్‌బాషా ప్రథమ చికిత్స అందించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్లకు ఈ-పాస్‌మిషన్లు

● లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు
● నేటి నుంచి పంపిణీ
● సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ వెల్లడి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీటీ ఫిరోజ్‌ఖాన్

మదనపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపు డీలర్లకు కొత్తగా స్మార్ట్ ఈ-పాస్ మిషన్లు, లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని స్థానిక సీఎస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్ వెల్లడించారు. ఇందులో భాగంగా శనివారం నుంచి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ-పాస్ యంత్రాలను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్డుదారులకు స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన విధివిధానాలు, సాంకేతికతను వివరిస్తూ, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కిశోర్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీటీ మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ఈ-పాస్ యంత్రాలను వెనక్కి ఇచ్చేసి, కొత్త స్మార్ట్ ఈ-మిషన్లను తీసుకోవాలని సూచించారు. వీటి ద్వారా రేషన్ సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా, సులభంగా జరగడమే కాకుండా రేషన్ డీలర్లకు సరుకుల పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులు ఉండవని తేల్చి చెప్పారు.

ఇక అది లేక సోమవారం నుంచి కార్డుదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పక్కాగా, పకడ్బందీగా చేయాలని ఫిరోజ్‌ఖాన్ ఆదేశించారు. మొదటగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు, బెడ్‌రీడెన్‌లకు ఇంటికే వెళ్లి ఈకేవైసీతో పాటు బయోమెట్రిక్ విధానంతో రేషన్ డీలర్, సచివాలయ ఉద్యోగి సంయుక్తంగా కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఇందులో రేషన్‌డీలర్, సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తర్వాత సాధారణ కార్డుదారులకు రేషన్ షాపులోనే రేషన్ డీలర్లు లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేయవచ్చని, అందులో కూడా బయోమెట్రిక్ తప్పనిసరిగా డీటీ పేర్కొన్నారు. ఈ కొత్తరకం మిషన్‌లో ఫొటోతో పాటు వాయిస్ రికార్డు ఉంటుందని, పంపిణీ సమయంలో కార్డుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వివరించారు. ఈ సమావేశంలో గోదాము డీటీ ఆర్.ఆర్ముగం, రేషన్‌డీలర్ల సంఘం నాయకులు ఎస్.మౌలాలి, ఖాజాహుస్సేన్, ఇమాంఖాసీం, కళాధర్, జె.మురళి, సుధీర్‌బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య



పవన్‌కుమార్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 12: పట్టణంలో ఎస్ఎస్ కాలనీలో ఉన్న కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ చప్పిడి పవన్‌కుమార్ నాయుడు (35), శుక్రవారం ఆ బ్యాంకు బాత్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన సిబ్బంది ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. రాజంపేట నియోజకవర్గం నుండుపల్లి మండలం చప్పిడివాండ్లపల్లెకు చెందిన పవన్‌కుమార్ ఐదు నెలల క్రితమే రాయచోటిలోని కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజరుగా బాధ్యతలు స్వీకరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు బ్యాంకులోని సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. కాగా, తన భర్త ఆత్మహత్యకు పని వత్తిడే కారణమని మృతుడి భార్య అనూష ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటాచలపతి తెలిపారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఇద్దరి మృతి



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన సంఘటన మండలంలోని మంగంపేట వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్ కథనం మేరకు మంగళంపల్లికి చెందిన అంకమ్మ (70)రామచంద్రయ్య, మరో మహిళ రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అంకమ్మ, రామచంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. మృతదేహాలతో పాటు, గాయపడిన మహిళను కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంచుకురిసే వేళలో...!

● మేఘాలలో తేలియాడిన హార్సిలీహిల్స్
● అద్భుత దృశ్యాలతో పర్యాటకుల పరవశం

బి.కొత్తకోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను చల్లటి మేఘాలు కమ్మేశాయి. గురు, శుక్రవారాల్లో చుట్టపక్కల ప్రాంతాల్లో వర్షం కురవడంతో పాటు, ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకున్నాయి. తేమతో కూడిన వాతావరణంతో చలిగాలులు వీచాయి. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తున ఉన్న హిల్‌స్టేషన్ కావడంతో కొండను మేఘాలు చుట్టేశాయి. 20 అడుగుల దూరంలో ఉన్న మనుషులు, వాహనాలు కూడా కనిపించని విధంగా దట్టమైన మేఘాలు విహరించాయి. హిల్స్‌పై నున్న వ్యూపాయింట్లు, గాలిబండ, ఘాట్‌రోడ్డు, అటవీ ప్రాంగణంలో మేఘాల సంచారం చూపరులను కట్టిపడేసింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో కొండపై విహరిస్తూ పర్యాటకులు పరవశించిపోయారు.



శీతాకాలాన్ని తలపిస్తున్న టూరిజం ప్రాంగణం



పర్యాటకులకు స్వాగతం పలుకుతున్న హిల్స్ ముఖద్వారం

మీ సేవలు మరువలేనివి

● బదిలీపై వెళుతున్న కలెక్టర్‌ను ఘనంగా సన్మానించిన టీడీపీ ప్రధాన నేతలు



కలెక్టర్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేసిన సేవలు మరువలేనివని రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వలి, టీడీపీ నాయకుడు గంగిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మదన్‌లు కొనియాడారు. శుక్రవారం వారు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను దుశ్శా లువాలతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ విస్తరింపజేసేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన అందించారన్నారు. ప్రతి చిరు ఉద్యోగం నుంచి జిల్లా అధికారులకు బదిలీ సర్వసాధారణమని, ఎక్కడ పనిచేసినా నిస్వా ర్థమైన సేవలు అందించినప్పుడే అధికారికి తగిన గుర్తింపు లభిస్తుందని వారు తెలియజే శారు.

సేంద్రియ ఎరువులతో లాభదాయకం

● జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

పుల్లంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో భూమిని కాపాడుకోవడమే గాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని వత్తలూరు, పీవీజీపల్లె, రంగంపల్లెల్లో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. వత్తలూరులో ఆయన మాట్లాడుతూ యూరియా వాడకం వల్ల భూసారం క్రమంగా తగ్గిపోయి పంటలకు చీడపీడలు పెరుగుతాయని, సేద్యం ఖర్చులు పెరిగి లాభాలు తగ్గుతాయన్నారు. ఏడీఏ మణి, వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, వెంకటసుబ్బయ్యయాదవ్, మారోతు మల్లి, బీమా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో బావురుపిల్లి మృతి

● పులిపిల్ల అనే ప్రచారాన్ని తోసిపుచ్చిన అధికారులు



బావురుపిల్లి చర్మాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ దిగువన వున్న సిరి కల్చర్ పార్క్ సమీ పంలో శుక్రవారం ఓ అడవిజంతువు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. చిన్నపాటి జంతువు గుర్తు తెలియని వాహనం కింద పడటంతో రోడ్డుకు అతుక్కుపోయి కేవలం చర్మం మాత్రమే కనపడు తోంది. ఈ ఘటనలో మృతిచెందింది పులిపిల్ల అంటూ ప్రచారం జరిగింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ హుటాహుటిన తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి ఘటనపై ఆరా తీశారు. చనిపోయింది పులిపిల్ల కాదని, బావురు పిల్లిగా పిలుచుకునే అడివిపిల్లి అని నిర్ధారించారు. ఈ విషయమై శివకుమార్ మాట్లాడుతూ మచ్చలున్న కారణంగా పులిపిల్ల అంటూ ప్రచారం చేశారని, దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..



ప్రమాద స్థలంలో పడి ఉన్న వృద్ధురాలు

చిన్నమండెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం వద్ద మతి స్థిమితం లేని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... గురువారం రాత్రి బెంగుళూరు- కడప జాతీయ రహదారిపై మతి స్థిమితం లేని ఒక వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. విషయం గమనించిన స్థానికులు సమాచారం అందించడంతో శుక్రవారం తెల్లవారుజామున సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాయచోటిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



నాగార్జున మృతదేహం

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి కాశీరావుపేట వద్ద హైవేలో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మదనపల్లె పట్టణం, ఎస్టేట్‌కు చెందిన చేనేత కార్మికుడు గురుమూర్తి కుమారుడు నాగార్జున(30) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మూడేళ్ల క్రితం వాయల్పాడు మండలం, చింతపర్తికి చెందిన లావణ్యతో వివాహమైంది. భార్య అమ్మగారి ఇంట్లో ఉండడంతో తీసుకురావడానికి వెళుతూ ప్రమాదం జరిగింది. అనంతరం శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అత్తపై దాడి కేసులో అల్లుడి అరెస్ట్



పోలీసుల అదుపులో ముద్దాయి నరసింహులు

నందలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్తపై దాడి చేసిన అల్లుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలిపారు. శుక్రవారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. అనంతపురానికి చెందిన నరసింహులుకు 13 ఏళ్ల క్రితం పద్మావతిబాయి కుమార్తె మంజుల బాయితో వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే నరసింహులు చెడు అలవాట్లకు బానిసై భార్య పిల్లలను పట్టించుకోకుండా వారిని హింసిస్తూ ఉండడంతో భార్య తన ఇద్దరు పిల్లల్ని తన తల్లి పద్మావతిబాయి దగ్గర ఉంచి కువైత్‌కు వెళ్లింది. తన భార్యాపిల్లలు దూరం కావడానికి అత్తే కారణమని పగ పెంచుకున్న అతను పథకం ప్రకారం ఈ నెల 7న సాయంత్రం మచ్చుకత్తితో ఇంటివద్ద ఉన్న పద్మావతిబాయిపై దాడి చేశాడు. ఆమె కోడలు శ్యామలాబాయి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన నందలూరు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి శుక్రవారం నందలూరు కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జూనియర్ బాలబాలికల ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేరకు అమ్మాయిలు 150 మంది బాలికలు, 200మంది బాలురు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి డీఎస్డీవో కె.జగన్నాథరెడ్డి హాజరై పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేసిన బాలబాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈనెల 22, 23, 24, 25వ తేదీల్లో విజయవాడ ఎగ్జిబిషన్ గ్రౌండ్ (గొల్లపూడి)లో జరగనున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జిల్లా కబడ్డీ ప్రెసిడెంటు గురుశేఖర్, సెక్రటరీ సుబ్బయ్య, కబడ్డీ కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

స్కూలుగేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాగుతున్న వివిధ క్రీడల ఎంపికలు ఆహ్లాదకర వాతావరణంలో సాగుతున్నాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు చంద్రావతి, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్, టేబుల్ టెన్నిస్, ఊషూ, తంగెట, ఖురేష్ తదితర పోటీలు జరిగాయి. ఇందులో అండర్-14, 17 బాలబాలికల ఉమ్మడి కడప జిల్లా నుంచి దాదాపు 350కి పైగా హాజరయ్యారన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా డీఎస్డీవో జగన్నాథరెడ్డి హాజరయ్యారు. అలాగే అండర్-19 బాలబాలికల ఎంపికలు రిమ్స్ సమీపంలోని స్పోర్ట్స్ స్కూలులో నిర్వహించారు. ఇందులో ఆర్చరీ, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్ పోటీలు జరిగాయి.

15న జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సాఫ్ట్‌టెన్నిస్ జట్ల ఎంపికలు జరగనున్నట్లు కడప సాఫ్ట్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పురుషోత్తంరెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9966211903 నంబరును సంప్రదించాలని సూచించారు.

క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 10వ తేదీన రీజనల్ స్థాయి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రెండు బృందాలు ఎంపిక కాగా రూ.10వేల నగదు, అవార్డును అందుకున్నారు. ఈ రెండు బృందాల్లోని 12 మందిని రాష్ట్రస్థాయిలో ఈనెలలో అమరావతిలో జరిగే హ్యాకథాన్‌లో పాల్గొంటారని డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు వల్లూరు విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్-14, 17లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. అండర్-17లో మార్షల్ ఆర్ట్స్ సైక్లింగ్ బాలికల విభాగంలో సింధూరి మొదటిస్థానం, అండర్-14 టైమింగ్ సైక్లింగ్ బాలికల విభాగంలో వైశాలి రెండోస్థానం, అలాగే అండర్-17 బాయ్స్‌టైమింగ్ సైక్లింగ్‌లో 4వ స్థానంలో విశాల్, అండర్-14 బాయ్స్ స్విమ్మింగ్‌లో మొదటిస్థానం భార్గవరెడ్డి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ సుశీలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.లక్ష విరాళం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఆర్వీ ట్రావెల్స్ ఎండీ ఆర్వీ రమణ రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం గంగనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్‌కు అందచేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు మరిన్ని వసతులు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పతకాలు సాధిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, గౌస్, తేజోవతి, దశరథరామి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్ఎంకు చెక్కును అందిస్తున్న ఆర్వీ రమణ





ఆటో ఓనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆదుకోనున్నట్లు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆటోవాలాలకు ఆర్థికసాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్లు అనంతపురం సభలో అధికారికంగా ప్రకటించడంతో ఆటోకార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి.

ఆటో కార్మికులకు.. చంద్రన్న భరోసా

చంద్రబాబు దసరా కానుక అదుర్స్..

- ప్రతి ఏటా రూ.15వేల ఆర్థిక సాయం
- దసరాకు పథకం ప్రారంభం
- ఉమ్మడి కడప జిల్లాలో 30వేల మందికి పైగా లబ్ది
- ప్రభుత్వంపై రూ.45కోట్ల ఆర్థిక భారం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో ఆటోడ్రైవర్ కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఆటోకార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఆటో కార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పూటగడవడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం వేలాది ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా ఇవ్వనుందని ఆటో కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 20956 వరకు ఆటోలు ఉన్నాయి. ఇందులో కడప జిల్లాలో 11709 ఆటోలు, అన్నమయ్య జిల్లాలో 9247 వరకు ఆటోలున్నట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఉమ్మడి కడప జిల్లాలో మరో 10వేలకు పైగా ఆటోలు ఉన్నట్లు ఆటో సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఈ పథకం అమలైతే ఉమ్మడి జిల్లాకు రూ.45కోట్ల వరకు నిధులు కావాల్సి ఉంది.

మార్గదర్శకాలు రానున్నాయి..

దసరా నుంచి అమలుకానున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు జారీ చేయనుంది. పథకానికి అర్హత సాధించడానికి నిబంధనలపై స్పష్టత ఇవ్వనుంది. సొంత ఆటో ఉన్నవారు, అలాగే అద్దెకు తీసుకొని నడుపుతున్న కార్మికులు ఉమ్మడి జిల్లాలో చాలా మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనే దానిపై స్పష్టత రానుంది. గతంలో ఆటోలు ఉన్నప్పటికీ ఆటోనడిపే లైసెన్సు బ్యాడ్జీలు కలిగిన వారికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కొత్త మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చూడాలి.

హరిత పన్ను తగ్గింపు

గత వైసీపీ ప్రభుత్వం హరిత పన్ను పేరుతో వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. లారీలు, టిప్పర్లు, కార్లు, ఆటోలు, స్కూలు బస్సులు, చివరకు బైక్‌లను కూడా పన్ను పేరుతో జేబులు గుల్ల చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరిత పన్నును భారీగా పెంచేసింది. అప్పటిదాకా రూ.200 ఉన్న పన్నును వివిధ స్లాబులుగా విడదీసేసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడు నుంచి పదేళ్లు అయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు పది నుంచి పన్నెండేళ్లు అయితే ఒక త్రైమాసికం పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. దీంతో పెరిగిన పన్ను భారం భరించలేక వాహనదారులంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటో కార్మికులకు భారీగా పన్ను భారం తప్పింది.



చాలా సంతోషంగా ఉంది..

ఆటో కార్మికులకు రూ.15వేలు చంద్రబాబు ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. స్త్రీశక్తి ద్వారా ఇబ్బంది పడుతున్న ఆటో వాళ్లను చంద్రబాబు గుర్తించారు. కూటమి ప్రభుత్వంలో ఆటోకార్మికులకు దసరా సంబరాలే.

- షేక్ రసూల్, ఏఎస్ఆర్ నగర్, కడప



ఆటోకు బాడుగలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇటువంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.15వేలు ఆటో కార్మికులకు ఇస్తానని ప్రకటించడం ఎడారిలో నీటి బుగ్గ దొరికినట్లుగా ఉంది. ఆటో కార్మికులకు బాబు ఇచ్చిన దసరా కానుక అదుర్స్ అని చెప్పాలి.

- ఎం.శ్రీనివాసులు, రంపతాడు, పెండ్లిమర్రి

మాకు కూడా వర్తింపజేయాలి..



ఆటో బాడుగకు నడిపిస్తున్నాను. అయితే బాడుగలు రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఆటో ఓనర్లతో పాటు మా లాటి బాడుగకు ఆటోలు నడుపుతున్న వారికి కూడా ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

- ఖాజా, అచారి కాలనీ, కడప

రిమ్స్ వైద్యులపై విచారణకు మార్గం సుగమం

కలికిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యశాలలో పనిచేసే నలుగురు వైద్యులతో పాటు కార్యాలయం సూపరింటెండెంట్‌పై నమోదైన ఆరోపణల గురించి విచారణ చేయడానికి మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2016 అక్టోబరులో ఏసీబీ అధికారులు ఈ ఐదుగురిపై అభియోగాలు నమోదు చేసి తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించారు. దాదాపు పదేళ్లుగా ఈ కేసు విచారణ జరగకుండా మూలనపడింది. అప్పట్లో రిమ్స్‌లో పనిచేస్తున్న ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, అదే విభాగంలోని మరో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.సంజీవయ్య, మరో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నా నగేష్, కంటి విభాగంలో పనిచేసే అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంపీడీఎల్ సత్యనారాయణతో పాటు కార్యాలయం సూపరింటెండెంట్ షేక్ మహబూబ్ బాషాలపై కొన్ని అవకతవకలు, అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కేసు విచారణ చేపట్టడానికి తిరుపతి సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును విచారణాధికారిగా నియమిస్తూ 2024 నవంబరు 27న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విచారణ పూర్తి చేయడానికి రెండు నెలలు గడువు విధించింది. విచారణ మధ్యలో తనకు ఆరోగ్యం సహకరించలేదనే కారణాలతో విచారణాధికారి రవిప్రభ తప్పుకున్నారు. దీంతో తదుపరి విచారణ చేపట్టి పూర్తి చేయడానికి విజయవాడ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే వైద్య విద్య అదనపు డైరెక్టరు డాక్టర్ డి.వెంకటేశ్వర రావును నియమిస్తూ గత నెల 18 ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజాగా విచారణాధికారికి ఏసీబీ నుంచి తగినంత సమాచారం అందజేసి సహకరించడానికి కడప రేంజి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిని ప్రెజెంటింగ్ అధికారిగా నియమిస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని భాకరాపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్ వివరాల మేరకు.. మండలంలోని వలుగురాళ్లపల్లె పంచాయతీ భాకరాపేటలో నివాసం ఉంటున్న డి.నారాయణ (46) ఇటీవల తనకున్న గొర్రెలను కాశినాయన మండలం ఇటుకలపాడుకు చెందిన పిచ్చయ్యకు రూ.7.60 లక్షలకు దాదాపు వంద గొర్రెలను అమ్మాడన్నారు. ఈ నేపథ్యంలో పిచ్చయ్య సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చి చివరికి గలాటాలు కూడా జరిగాయన్నారు. ఈ విషయం జీర్ణించుకోలేక నారాయణ విషద్రావణం తాగి గురువారం అర్ధరాత్రి సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడని, రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మునయ్య కోనలో మృతదేహం లభ్యం

ముద్దనూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న మునయ్యకోన వద్ద శుక్రవారం గంగాధర్ అనే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ తెలిపిన సమాచారం మేరకు.. తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన గంగాధర్(52) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చి మునయ్య కోన వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు గురువారం తొండూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో మునయ్య కోన వద్ద మృతదేహం లభ్యమైంది. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటిపై పడిన పిడుగు



స్లాబుకు రంధ్రం ఏర్పడిన దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం దిగువపట్నం కాలనీలోని ఆర్ఎంపీ డాక్టర్ జకరయ్య మూడవ అంతస్థుపై పిడుగు పడింది. దీంతో స్లాబుకు పెద్ద రంధ్రం ఏర్పడింది ఇంటిలోని పీవోపీ ధ్వంసమైంది. బండలు పగిలాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు బయటికి వచ్చారు. భారీ వర్షం కారణంగా పిడుగు పడడంతో ఆ ప్రాంతంలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కేసు నమోదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మహిళ ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ టీఎన్ మూర్తి తెలిపారు. పోరుమామిళ్లలోని వాసవీనగర్‌కు చెందిన బట్టు చంద్రిక 2024లో కర్నాటకకు చెందిన నాగరాజును ప్రేమ వివాహం చేసుకుంది. వివాహమైన కొద్దిరోజులకే ఆమె భర్త నాగరాజు, అత్త అదనపు కట్నం కోసం తనను మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రబల్లెకు చెందిన రాములు(54) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. రాములు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



మేకల సుమతి

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తన కుతూరు ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయిందని శుక్రవారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మైదుకూరు మండలంలోని ముత్తరాయపల్లె గ్రామానికి చెందిన మేకల సుమతి (22)కి చెండ్రాయుడుతో వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల పాప కూడా ఉంది. చిన్నపాపను తీసుకొని సుమతి ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయిందని ఆమె తల్లి మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిస్తే 9121100618 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి జైలుశిక్ష

పోరుమామిళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తిరుపతి కోర్టులో మల్లేపల్లెకు చెందిన కప్పల రమేశ్, గురుప్రసాద్‌లకు ఐదు సంవత్సరాల జైలుశిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ పరిధిలో 2019లో జరిగిన ఎర్రచందనం కేసులో వీరికి కోర్టు ఈ శిక్ష విధించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

296 పరుగుల వెనుకంజలో అనంతపురం

- 345 పరుగుల ఆధిక్యంలో నెల్లూరు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్-23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లో భాగంగా శుక్రవారం వివిధ జట్ల మధ్య జరుగుతున్న రెండో రోజు ఆటలో ప్రత్యర్థి జట్టుపై అనంతపురం జట్టు 296 పరుగులు, అలాగే మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు ప్రత్యర్థి జట్టుపై 345 పరుగుల ఆధిక్యత సాధించాయి.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు, అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 57ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. 222 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో తిరిగి రెండోరోజు శుక్రవారం బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 93.3 ఓవర్లలో 410 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌట్ అయింది. 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన గణేశ్ 97పరుగుల వద్ద అవుట్ అయ్యారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలరు ప్రమోద్‌కుమార్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 24ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు మరో 296 పరుగులు లోటుతో ఎదురీదుతోంది.

ఏసీఏ మైదానంలో..

రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు, చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 75 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 407 పరుగులు భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో కుమార్ 226, సుతేజ్‌రెడ్డి 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. 407 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో తిరిగి రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొత్తంగా 105.2 ఓవర్లలో 554 పరుగులు భారీ స్కోరు చేసి ఆలౌట్ అయింది. ఇందులో మాధవ్ 82 పరుగులు చేశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 47.4 ఓవర్లలో కేవలం 211 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో వై.తేజారెడ్డి 78 పరుగులు చేశారు. కాగా బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలరు అఖిల్ సాలంకే 5 వికట్లు పడగొట్టాడు. దీంతో నెల్లూరు జట్టు 343 పరుగుల మొదటిఇన్నింగ్స్ ఆధిక్యత సాధించినట్లయింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప నాగరాజుపేట,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కడప టౌన్-2 సబ్‌డివిజన్ డీఈఈ లక్ష్మానాయక్ తెలిపారు. ముత్రాసుపల్లె, రెడ్డికాలనీ, పకీరుపల్లె, ఓంశాంతినగర్, అబ్దుల్‌కలాంకాలనీ,చిన్నచౌక్,విద్యామందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ,దేవుని కడప, గౌస్‌నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లె రోడ్డు, మాసాపేట,నమస్తేబోర్డు, భారతిబార్, ద్వారకానగర్, సంధ్యాసర్కిల్,ఎర్రముక్కపల్లె,సీపీబ్రౌన్,మున్సిపల్‌ఆఫీస్,ఆర్టీసీ బస్టాండ్, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పులివెందుల రూరల్..: పట్టణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11కేవీ పులివెందుల సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చక్రాయపేట..: మండలంలోని 33కేవీ సిద్దారెడ్డిపల్లె ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఫీడర్ పరిధిలోని గ్రామాలలో శనివారం మధ్యాహ్నం 1.30గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు జాతీయ భాష హిందీ దినోత్సవ వేడుకలు

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడపలోని సీపీబ్రౌన్ భాషా పరిశోధన గ్రంథాలయ సమావేశ మందిరంలో జాతీయ భాష హిందీ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు అధ్యక్షుడు ఎస్ఎంఎస్ ఖాదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ విద్యావేత్తలు, సాహితీ వేత్తలు,అధికారులు, హిందీ ప్రచారకులు పాల్గొంటున్నారన్నారు. హిందీ భాషాభిమానులు, హిందీ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలపై బీజేపీ నేతల హర్షం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందని శుక్రవారం బీజేపీ నేతలు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బాల గురవయ్య,రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముక్కు మూసుకోవాల్సిందే..!

వారం రోజులుగా పొంగుతున్న మురుగునీరు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాకరాపురం ప్రాంతంలోని ఓ వీధిలోకి వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. వారం రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగుతున్నా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. పట్టణంలోని బాకరాపురంలోని ఓ వీధిలో వారం రోజుల నుంచి మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు బయటకు వస్తోంది. విషయాన్ని అధికారులకు ప్రతిరోజూ చెబుతున్న పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఆ మ్యాన్‌హోల్ నుంచి వచ్చిన మురుగునీరు అక్కడే నిల్వ ఉంటోందని అంటున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా మున్సిపల్ అధికారులకు కనికరం కూడా లేకుండా పోతోందని అంటున్నారు. ద్విచక్రవాహనదారులు ముఖ్యంగా పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్‌హోల్ నుంచి నానా చెత్తాచెదారాలు వస్తుండడంతో వాహనాల రాకపోకల సమయంలో ఆ వ్యర్థాలు దుస్తులపై పడుతున్నాయని వాపోతున్నారు.అధికారులుచర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.



బాకరాపురంలోని ఓ వీధిలో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగునీరు

విద్యతోనే పేదరికం దూరం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్య పేదరికాన్ని తగ్గిస్తుందని ఎంఈవో-2 రామానాయుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

పులివెందుల రూరల్,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వలన రోగాలు దరిచేరవని బాకరాపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారి శాంతికుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూల్‌ను వైద్యాధికారి శాంతికుమార్ సందర్శిం చారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతనూ...

వల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఓబులమ్మ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని గణేశ్‌పురంలో స్థానికులతో మాట్లాడారు. అనంతరంఎస్‌డబ్ల్యూ షెడ్డు తనిఖీ చేశారు. వీరి వెంట డీడీవో ఇన్‌చార్జి జీఎస్‌డీవో మైథిలీ, ఎంపీడీవో రఘురాం, డిప్యూటీఎంపీడీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి వెళితే యువత భవిష్యత్తు చిత్తే

చెన్నూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ జోలికి వెళితే భవిష్యత్తు చిత్తు అవుతుందని సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో స్థానిక గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యకర్మంలో ఏఎస్ఐ మల్లయ్య,ప్యాక్షన్ జోన్ సీఐ సుబ్రమణ్యం శక్తి టీం ఎస్ఐ శాంత, కళాశాల ప్రిన్సిపాల్, ఛైర్మన్, అధ్యాపక బృందం,తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులుసైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని తెలుగుగంగ కాలనీ ఎన్‌సీసీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సైబర్ క్రైం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ట్రాఫిక్ సీఐ జావెద్,సైబర్ క్రైం కానిస్టేబుల్ ప్రసాద్, ఎన్‌సీసీ కల్నల్ ఎన్.వి.మోయిన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

వల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శీతోరుపల్లెలో శుక్రవారం టీడీపీ నాయకుడు కూలూరు ప్రతాప్ రెడ్డి, సంబంధిత ఏఈతో కలిసి రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పుత్తా కుటుంబం ప్రజల క్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటుం దన్నారు. రోడ్డునిర్మాణంతో ప్రజలకు ప్రయాణం సౌకర్యంగా ఉంటుందన్నారు.

ఉల్లి కొనుగోలు కేంద్రం ఎక్కడ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మార్కెట్‌యార్డులో ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉల్లి కొనుగోలు కేంద్రం ఎక్కడుందో చూపాలని సీపీఐ రైతు సంఘంజిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం సీపీఐ ప్రతినిధి బృందం, మార్కెట్‌యార్డులోని ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిం చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి,జి.నాగేశ్వర్ రావు,వరప్రసాద్, రెడ్డయ్య, రాయప్ప, రమణ,ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతీ యువకులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ సూచించారు. శుక్రవారం పులివెందుల న్యాక్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు 226 మంది హాజరు కాగా 114 మంది ఉద్యోగాలు సాధించారన్నారు.

చోరీ

పులివెందుల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్‌క్లబ్ సమీపంలో శేషారెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. బుధవారం రాత్రి శేషారెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, కొంత డబ్బును ఎత్తుకెళ్లారు. పోలీసులు గురువారం క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. శేషారెడ్డి బంధువులకు అనారోగ్యం కారణంగా కడపరిమ్స్‌కు వెళ్లడంతో శుక్రవారం అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తికి గాయాలు

పులివెందుల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనంద్ అనే వ్యక్తికి అనుమానాస్పద రీతిలో గాయాలయ్యాయి. యర్రగుడిపల్లెకు చెందిన ఆనంద్ జేఎన్టీయూ కళాశాల సమీపంలో శుక్రవారం 6.30గంటల ప్రాంతంలో గాయాలతో పడిపోయారు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ఆనంద్‌ను ఓ ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బైకులో వెళ్తుండగా ప్రమాదం జరిగిందని కొందరు, ఎవరో దాడి చేశారని మరికొందరు.. ఇలా భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆనంద్ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఆనంద్ స్పృహ వచ్చిన అనంతరం పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

కరువు భత్యం, పీఆర్‌సీ, ఐఆర్‌ను మంజూరు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం, పీఆర్సీ, ఐఆర్, క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంటు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అహరోన్ కోరారు. శుక్రవారం గుంతబజారులోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువుభత్యం ఇవ్వాలంటే సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పుస్తకాల బహూకరణ

కడప కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లెలోని గ్రామీణ ప్రజాచైతన్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు ప్రతాప్‌రెడ్డి సుమారు 200 పుస్తకాలను శుక్రవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, ఎన్.రమేశ్‌రావు సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకురాలు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన గ్రంథాల్లో అమ్మమ్మగారి ఊరు, గతం మరిచిన మనిషితదితర గ్రంథాలున్నాయన్నారు. కార్యక్రమంలో సహాయ పరిశోధకులు గోపాలక్రిష్ణశర్మ, హరిభూషణ్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



కడప ఎర్రముక్కపల్లె,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరం లోని జిల్లా పరిషత్ రోడ్డులో ఎన్‌సీఏపీ నిధులు రూ.27లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ్రాయ చైర్మన్ రెడ్డయ్య, సిటీజైన్ ప్రెసిడెంట్ లయన్ మస్సూర్ ఖాన్ తదితరులుపాల్గొన్నారు.

ఉర్దూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న అధికారులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ చదివే విద్యార్థులను పక్కదారిపట్టించే విధంగా విద్యాశాఖ డిప్యూటీ డీఈఓలు ప్రయత్నించడం ఏమిటని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాష శుక్రవారం తమ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. ప్రతి మండలానికి ఒక ఉర్దూ కళాశాలను, ప్రతి నియోజకవర్గానికి ఒక డిగ్రీకళాశాలను ఏర్పాటుచేసే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆప్‌కి ఆవాజ్ నగర ఉపాధ్యక్షుడు అబీద్ హుస్సేన్, నాయకుడు అమీర్ పాల్గొన్నారు.

యూరియాను అక్రమంగా తరలిస్తే కేసులు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):యూరియాను అక్రమంగా నిలువ ఉంచినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని సీఐ చల్లనిదొర తెలిపారు.వెల్లటూరు గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు.

అంగడివీధి విద్యార్థుల ప్రతిభ

సీకేదిన్నె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా తరుపున స్విమ్మింగ్‌లో అంగడివీధి విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పీఈటీ అగ్గిరప్ప తెలిపారు. కాగా గురువారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. దీంతో వారిని శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కాగా స్విమ్మింగ్‌లో ఈశ్వర్, మనోజ్, సైక్లింగ్‌లో జశ్వంత్‌కుమార్‌రెడ్డి, టీబీ మరియం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కంపు కొడుతున్న ఆర్టీసీ బస్‌పాస్ కౌంటరు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండులో విద్యార్థులకు, జర్నలిస్టులకు సీజన్ టికెట్లదారులకు బస్‌పాస్‌లు ఇచ్చే కౌంటరు కంపు కొడుతోంది. దీంతో పాస్‌ల కోసంకౌంటరు వద్దకు వచ్చేవారు తీవ్ర నరకయాతనకు గురవుతున్నారు. కాగా కౌంటరు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. అందులో ఇద్దరు బస్‌పాస్‌లు ఇచ్చేందుకు సేవలందిస్తుంటారు. దాని పై గది బాత్‌రూం, లెట్రిన్ రూముల నుంచి కింద ఉన్న కౌంటరుకు ఆనుకుని వ్యర్థాలు పోయే పైపులైను అమర్చారు. గతంలో ఓ సారి లెట్రిన్, బాత్‌రూముల నుంచి లీకైన వ్యర్థాల కంపునీటి కారణంగా దుర్వాసన అమాంతంగా వెదజల్లేది. ఈ విషయాన్ని సంబంధిత కడప డిపో మేనేజరు దృష్టికి ఆ కౌంటరు సిబ్బంది తీసుకెళ్లగా తాత్కాలికంగా మరమ్మతులు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం మరోసారి పైనున్న బాత్ రూం. లెట్రిన్ రూముల పైపులు లీక్ కావడంతో అందులో నుంచి మురుగునీరు బయటికి పోకుండా కౌంటరు లోపలి నిల్వ ఉండిపోతున్నాయి. దీంతో అక్కడ పనిచేసే వారితో పాటు బస్‌పాస్‌ల కోసం అక్కడికి వస్తున్న వినియోగదారులకు సైతం వారి ముక్కుపుటాలు అదిరే విధంగా వస్తున్న కంపుతో బెంబేలెత్తుతున్నారు. అధికారులేమో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. కాగా బస్‌పాస్ కౌంటరులోనికి పైపుల నుంచి లీకవుతున్న మురుగునీరు చేరుతున్న నేపథ్యంలో పైపులైను మరమ్మతులు చేయిస్తున్నామని, అంత వరకు ఆ కౌంటరును మరో చోటకు మార్పు చేయాలని కడప డీఎం కన్యాకుమారి తెలిపారు.



పైపులైను లీక్ కావడంతో బస్‌పాస్ కౌంటరులోకి చేరిన మురుగునీరు

15నుంచి జరిగే రణభేరిని జయప్రదం చేయండి

చెన్నూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 15 నుంచి నిర్వహించే రణభేరీని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి బి.లక్ష్మీరాజా అన్నారు. శుక్రవారం చెన్నూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. 15న కర్నూలులో ప్రారంభించి 19న నంద్యాల,18న కడపజిల్లాలో ప్రారంభమై మైదుకూరులో ముగుస్తుందని అన్నారు. యూటీఎఫ్ పాల్గొన్నారు.

24నాటి దళిత రణభేరిని...

కడప మారుతీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24న జరగనున్న దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు సగిలి గురప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు.నాయకులు జేబీ, కిరణ్, రాజ, చంద్ర పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్యకు ఘన సన్మానం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గండికోట వెంకటసుబ్బయ్యను సన్మానించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కడప నగరంలో పలుడివిజన్లలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆమట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పరిశీలించాలన్నారు. ఉన్న మురుగునీరు, చెత్త సత్వరం తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అలాగే వార్డుల్లో జ్వరం కేసులు ఎన్నిఉన్నాయో తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సెక్రటరీలకు సూచించారు.

హోటల్ యాజమాన్యానికి నోటీసులు

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ నగరంలోని లక్ష్మీరంగ థియేటర్ సమీపంలోఉన్న సౌజన్య హోటల్ యాజమాన్యానికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత శుక్రవారం నోటీసులు జారీ చేశారు. హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యత, హోటల్ నిర్వాహణ బాగాలేదంటూఫిర్యాదులు అందడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ భవన సామర్థ్యం, ఆహారం తయారీ,కస్టమర్లకు అందిస్తున్న సేవలపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బిల్డింగ్ ప్రమాణాలు బాగాలేక పోవడం, శుభ్రత లోపించడంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హోటల్ నిర్వాకులకు నోటీసులు అందజేశారు.15 రోజుల్లో హోటల్ అన్ని విధాలా సరి చేసుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్ఐ వీరేశ్ సేవలు అభినందనీయం

కడప క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖకు ఆర్ఐ వీరేశ్ అందించిన సేవలు మర వలేనివని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా జిల్లాపోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య,ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రీచైతన్య హైస్కూల్లో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు

వేంపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్లో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. శ్రీసత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగ్గా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కర్తవ్యమే దైవం అనే అంశంపై విద్యార్థుల తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు సాయినాథ్, గోవర్ధన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థినిలను చదువులో ప్రోత్సహించాలి

వేముల,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలని జీసీడీఓ రూత్‌ఆరోగ్యమేరి అన్నారు. శుక్రవారం వేముల కేజీబీవీ పాఠశాలను జీసీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, భోజనాలు తదితర సౌకర్యాలు పరిశీలించారు. కడపలో ఈనెల 11న జరిగిన స్విమ్మింగ్ పోటీలలో అండర్-17 విభాగంలో జి.లక్ష్మీప్రియ, అండర్-19 విభాగంలో ఎం.కుసుమ, లావణ్యలు ఎంపికయ్యారన్నారు. వీరిని జీసీడీఓ రూత్ ఆరోగ్యమేరీ, ఎంఈఓ-2 రఫిక్‌జాన్‌లు బొకేతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలు నిర్వీర్యం'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని మాజీ ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాష తెలిపారు. శుక్రవారం నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలన్నీ నెరవేర్చామని విజయోత్సవ సభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ప్రతి పథకంలో కోతలు విధిస్తూ ప్రజల నుమభ్య పెడుతున్నారని ఆరోపించారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శేషాచలపతి బాధ్యతలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె ఎంపీడీఓగా శేషాచలపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.చంద్రశేఖర్‌రెడ్డి పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో శేషాచలపతి ఎంపీడీఓగా నియమితులయ్యారు. గతంలో ఈయన సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగారు.

యువతకు నేతాజీసుభాష్ ఆదర్శ ప్రాయుడు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ యువతకు నేతాజీసుభాష్ ఒక ఆదర్శ ప్రాయుడని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి జి.దేవరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలో ఏఐఎస్‌బీ 9వ జాతీయ మహాసభలు నిర్వహించారు. మహవీర్ సర్కిల్ నుంచి ఎర్రముక్కపల్లె, సంధ్యాసర్కిల్ మీదుగా జిల్లా పరిషత్ వరకు ర్యాలీగా వచ్చి జిల్లా పరిషత్ వద్ద బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, సుందరరామరాజు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా మల్లికార్జునమూర్తి

మైదుకూరు, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగృహ నిర్మాణ సంస స్టాండింగ్ కౌన్సిల్‌గా భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ కో కన్వీనర్, రాష్ట్ర ఎన్నిక ల సమన్వయ కమిటీ కన్వీనర్(లీగల్) కోటయ్యగారి మల్లికార్జునమూర్తిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు నందు నియ మిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీచేసింది. ఈపదవిలో ఆయన 3సంవత్సరాల పాటు కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన రాష్ట్రముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాదవ్, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రదాన కార్యదర్శి మదుకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డులు తనిఖీ

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జమ్మలమడుగు డీఎల్‌డీవో రామాంజనేయులు శుక్రవారం రికార్డులు తనిఖీ చేశారు. 15 వ ఆర్థిక సంఘం నిధుల గురించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అదేవిధంగా శానిటేషన్, సర్వేల గురించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, ఏవో సుబ్బయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా ఉట్టి శారద

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం నందవరంలో వెలసిన చౌడేశ్వరీదేవి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా ప్రొద్దుటూరుకు చెందిన దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఉట్టి నాగశయన భార్య ఉట్టి శారద ను నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ 1042 జీవోను విడుదల చేశారు. ఉట్టి శారద 34వ వార్డుకు చెందిన టీడీపీ నాయకురాలు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అమె టీడీపీ తరుపున కౌన్సిలర్‌గా పోటీ చేశారు. ఉట్టి శారదను నందవరం చౌడేశ్వరీ దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికపై ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య హర్షం వక్తం చేశారు.

దోమల నియంత్రణే లక్ష్యం

బద్వేలు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నివారణకు దోమలను నియంత్రణ చేయడం ప్రజలందరి బాధ్యత అని సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అనంతరాజపురం ప్రాథమిక , ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన నిర్వహించారు.

మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 104/2025 O.S. No. 5/2025

ఏరువా వెంకటసుబ్బయ్య S/o లేట్ సుబ్బయ్య, హిందు, వయస్సు 71 సం., బిజినెస్, పోరుమామిళ్ల (గ్రా. & మం.) వైయస్ఆర్ కడపజిల్లా - పిటీషనర్/వాది

V/s

బసిరెడ్డి చెన్న క్రిష్ణారెడ్డి S/o బి. రోషిరెడ్డి, వయసు 50 సం., గంగన్నపల్లె (గ్రా.) ఎస్.ఏ.కాశినాయన (మం.) ప్రస్తుతం రెడ్డినగర్, పోరుమామిళ్ల టౌన్, వైయస్ఆర్ కడపజిల్లా. - రెస్పాండెంట్/ప్రతివాది

పై నెంబరు కేసులో పిటీషనరు వాది, రెస్పాండెంట్, ప్రతివాది అయిన మీ పైన బాకీ డబ్బులు రాబట్టుకొను టకుగాను రు. 29,98,125/-లు రాజశ్రీ కోర్టులో I.A. No. 104/2025 R38, R5 పిటీషన్ మరియు దావాను దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మరియు పిటీషన్‌లో కనబర్చిన షెడ్యూలు రాఖలా ఆస్తిని అటాచ్‌మెంట్ కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ దావాలో మీకేమైనా అక్షేపణలున్న యెడల 25-9-2025 ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేని యెడల పిటీషన్ మరియు దావా మీ పరోక్షముగా తీర్మానించబడును. షెడ్యూల్ : Land Situated in Kadapa Dist, Porumamilla Mandalam, Rangasamudram Village, 6th Ward, Giri Nagar Weaker Section, Near D.No. 6/64, Corresponding to New D.No. 10/20(1) on Eastern Sy.No. D.No. 1119/2 96.02 Sq. yards out of Ac. 0.82 Cents. Boundaries : East : Site of Guddeti Subhasini @ Abbineni Subhashini, Sanga Veeraiah and Pothireddy Subba Reddy etc., South : Kaluva and Site of Basireddy Chenna Krishna Reddy, West : Site of Narusu Perchalamma and Other, North : 15 Feet Width Rastha in the Same Sy. No.

పి.వి.ఎస్.ప్రసాద్, అడ్వకేట్, బద్వేలు.

రోడ్డు పనుల్లో జాప్యమెందుకో..?

- టెండర్లు జరిగినా ప్రారంభంకాని పనులు
- నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- ప్రయాణం నరకప్రాయంగా మారిన వైనం

దువ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిధులుండి కూడా రోడ్డు పనులెందుకు చేపట్టరంటూ ప్రజలు మండిపడుతున్నారు. దువ్వూరు మండలంలోని పలు ప్రాంతాల్లో గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ కోవలోకే మెయిన్ రోడ్డు నుంచి రామాపురం, అటు నుంచి చల్లబసాయిపల్లె వరకు మొత్తం నాలుగు గ్రామాల మీదుగా ఉన్న తారురోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఈ దారి వెంబడి కొన్ని చోట్ల తారు లేచిపోయి కంకర రాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామాపురంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్న కారణంగానే రోడ్డు పనులు చేపట్టలేదనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారి నుంచి రామాపురం, అటు నుంచి వెల్లాలు కొట్టాలు, గొల్లపల్లె, ఆపై చల్లబసాయిపల్లె వరకు రోడ్డు గతుకుల మయంగా ఉంది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. బైకులమీద వెళ్లే ప్రజలు కిందపడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు బాగుపడుతుందని ప్రజలు భావించారు. ఆ విధంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకుని రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యే విధంగా శ్రద్ధ పెట్టి ఆమేరకు నిధులు కేటాయింపు చేయించారు. అయితే పనులు మాత్రం అమలు చేపట్టక పోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.



దుస్థితిలో గొల్లపల్లె-చల్లబసాయిపల్లె రహదారి



గోతులు పడ్డ రామాపురం వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు

పంచాయతీరాజ్ డీఈ ఏమన్నారంటే...

ఈ ప్రాంతంలో అధ్వాన్నంగా ఉన్న తారు రోడ్డు గురించి పంచాయతీరాజ్ డీఈ హరినాధ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా రోడ్డు పనుల కోసం రూ.2,59,34000 నిధులు మంజూ రయ్యానని తెలిపారు. ఈ మేరకు ఆగస్టులో టెండర్లు పూర్తయ్యాయని సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాగానే పనులు చేయిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు చివరికల్లా పనులు మొదలు పెట్టి సకాలంలో పూర్తి చేయిస్తామని ఆయన చెప్పారు. ఇది అమలు అయితే నాలుగు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

డైరెక్టర్ రంతుకు ఘన సన్మానం

కలసపాడు,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కలసపాడు టీడీపీ నేత సాధనకారి రంతును శుక్రవారం మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మామిళ్లపల్లెకు చెందిన మన్యం మల్లికార్జునరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భూపాల్‌రెడ్డి, దూలంవారిపల్లెకు చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సత్యం, రైతుసంఘం కార్యదర్శి పోలయ్య, సుధాకర్, అగస్టీన్, తిమోతితో పాటుపలలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాం ఏచూరి వర్ధంతి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సమసమాజ స్థాపన కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు విజయకుమార్, సాల్మన్ వెంకటసుబ్బయ్య, రాములమ్మ, సుబ్బమ్మ, విశ్వనాథ్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో: సీతారాం ఏచూరి జీవితం నేటితరానికి ఆదర్శమని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడుశివనారాయణ తెలిపారు. శుక్రవారం మైలవరంలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండయ్య కృష్ణ, నారాయణ, మోహన్ పాల్గొన్నారు.

మైలవరం నుంచి పెన్నాకు నీరు విడుదల

మైలవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి అయిదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు మైలవరం జలాశయ అధికారులు శుక్రవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అయిదు వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది. దీంతో పెన్నానదికి అయిదు వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు 200 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.4 టీఎంసీలు నీరు నిలువ ఉంది. పెన్నా పరివాహక ప్రాంతాలైన దొమ్మరనంద్యాల, వేపరాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తదితర పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు, పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జమ్మలమడుగు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజగోపాల్ తెలిపారు. జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరు, ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.సబ్‌స్టేషన్లలో మెయింటినెన్స్ పనుల కారణంగా రెండవ శనివారం పురస్కరించుకుని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లిరోడ్డు, రాణీవనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దు టూరు రోడ్డు, ఎస్టేట్ ఏరియాల్లో ప్రజలు సహకరించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శ్రీనివాసులు, గురయ్యలను శుక్రవారం బ్రహ్మంగారి మఠం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సన్మాన సభలో వక్తలు మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఎంఈవో వెంకటేశ్వర్లు, మల్లేపల్లె సర్పంచ్ భర్త నారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించాలి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మధ్యంతర భృతి కోసం ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ఈ సందర్భంగా శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ 2023 జూలై నుంచి 12 వ పీఆర్సీని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వర్తింప చేయాల్సిఉండగా రెండేళ్లు గడిచిన కనీసం పీఆర్సీ కమిషనర్ ను కూడా నియమించకపోవడం దారుణమన్నారు. 2024 నుంచి నాలుగు విడతలుగా డీఏలను ప్రకటించాలన్నారు. అనవసర యాప్‌లను రద్దు చేయా లన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి సయ్యద్ బాషా, జిల్లా కౌన్సిలర్లు అప్సర్ బాషా, నరసిం హకుమార్, సురేష్, రామసుదాకర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగరాజు, క్రిష్టయ్యలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు సురేంద్రనాథరెడ్డి, భూపాల్‌రెడ్డి, అబ్దుల్‌సత్తార్, ప్రసాద్, క్రిష్టారెడ్డి, సీతారామిరెడ్డి, సుబ్బయ్య, అన్వర్‌లు మాట్లాడుతూ పెండింగులో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని సీపీఎస్ రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు.

చాపాడులో: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యాయులు అదర్‌బాష, కొండారెడ్డి, కృష్ణయ్య, రామసుబ్బారెడ్డి నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం సీఆర్‌పీ కమీషన్‌ను నియమించాలని, నాలుగువిడతల డీఏను ప్రకటించాలని, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. రెవెన్యూ అధికారులకు వారు వినతి పత్రం అందజేశారు.

ఆటో, మోటరు బైకు ఢీ: యువకుడికి తీవ్ర గాయాలు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామ సమీపంలో ఆటో, మోటరుబైకు ఢీకొన్న ప్రమాదంలో షఫీ అనయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల పట్టణానికి చెందిన షఫీ బద్వేలు పట్టణంలోని ఓ వివాహానికి హాజరై తిరిగి మోటరు బైకుపై పోరుమామిళ్లకు వస్తుండగా లక్ష్మీపాలెం సమీపంలో ఆటో ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వెనుకనే వస్తున్న బంధువులు గమనించి 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

సజావుగా యూరియా పంపిణీ

ముద్దనూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రైతులకు మన గ్రోమోర్ ద్వారా శుక్రవారం యూరియా పంపిణీ చేసినట్లు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. 9.9 టన్నులు 220 బస్తాలు యూరియా రాగా 111 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులకు అవసరం మేరకు యూరియా వస్తుందని ఏడీఏ తెలిపారు.యూరియా పంపిణీని సీఐ దస్తగిరి పర్యవేక్షించారు.

మైదుకూరు రూరల్‌లో: రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూరియాను సజావుగా పంపిణీ చేశామని శుక్రవారం మండల వ్యవ సాయశాఖ అధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు మండలంలోని గంజికుంట పరిధిలో 7 మెట్రిక్ టన్నులు, ఎన్ ఎర్రబల్లె పరిధిలో 7మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ వనిపెంటలో 9.9మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ జీవి సత్రంలో 9.9 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులుకు పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు.

అపోహలు నమ్మి రైతులు మోసపోవద్దు

ఖాజీపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు యూరియా అందుబాటులో ఉందని, అపోహలు నమ్మి రైతులు మోసపోవద్దని ఏవో నాగార్జున తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కూనవారిపల్లె, నాగసానిపల్లె, త్రిపురవరం గ్రోమోర్ సెంటర్ ప్రైవేటు డీలర్ల వద్ద 40 టన్నుల యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు యూరియా స్టాకు ఉంచుకుంటున్నారని అపోహలు నమ్మి రైతులు స్టాకు పెట్టుకుంటే యూరియా గడ్డలు కడుతుందన్నారు. అది చల్లేందుకు కూడా వీలుండదన్నారు. జిల్లాలో రైతులకు కావాల్సినంత యూరియా ఉందని, పంపిణీ కార్యక్రమంలో రైతులు క్రమపద్ధతిలో తీసుకుంటున్నారని, ఎటువంటి ఘర్షణలకు దిగకుండా పంపిణీ సజావుగా సాగుతోందన్నారు.

బద్వేలులో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటుచేయాలి

బద్వేలు, సెప్టెంబరు 12, (ఆంధ్రజ్యోతి): బద్వేలును రెవెన్యూ డివిజన్ చేసిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పా టు చేయాలని సీపీఐఎంఎల్ జిల్లా స్టాం డింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్, జిల్లా కమిటీ మెంబర్ జకరయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఉన్నందున వేలాది మంది పలు సమస్యలపై బద్వేలుకు వస్తుంటారని తద్వారా పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా నాయకులు అనిల్, నాయకులు నారాయణ, చంద్రపాల్ , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

మంచినీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

పోరుమామిళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని పూలబజారులో మంచినీటి సమస్యను సర్పంచ్ యనమల సుధాకర్ శుక్రవారం పరిష్కరించారు. గత కొద్దిరోజులుగా మంచినీటితో ఇబ్బంది పడుతుండడంతో ఆ వీధివాసులు సమస్య సర్పంచ్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన స్పందించి మండల గ్రాంటులో రూ.4లక్షల నిధులతో కొత్త బోరు మోటరు వేయించి మంచినీటి సమస్యను పరిష్కరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం

కాశినాయన సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మూలపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రదానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న జీవీ చంద్రశేఖర్ ఆచారి ఫేజ్2 కింద పాఠశాలలో మిగిలిపోయిన పనులను పూర్తిచేశాడు. ఇందులో భాగంగా పాఠశాల అంతకూ రంగులు వేయించడం, విద్యార్థుల ప్రమాదాల నివారణకు పాఠశాల ముందు స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు, స్పీడ్ బ్రేకర్లను సొంత నిధులతో పూర్తిచేసి తన ఓదార్యాని చాటుకున్నారు. ప్రస్తుతం పాఠశాల చూడ ముచ్చటగా ఉంది.

మంత్రి నారా లోకేశ్ ఆపద్బాంధవుడు

- నేపాల్‌లో చిక్కుకున్న బద్వేలు వాసులు సురక్షితంగా గమ్యస్థానం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారాలోకేశ్ మాపాలిట అపద్బాంధవుడని బద్వేలు పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన మారేళ్ల శ్రీనివాస్, వారి సతీమణి సుశీలలు పేర్కొన్నారు. నేపాల్ సందర్శనకు వెళ్లిన ఆంధ్రులు అక్కడ విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుపోయిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రినారాలోకేశ్ చాకచక్యంగా వ్యవహరించి కేంద్ర విమానశాఖతో మాట్లాడి ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి నేపాల్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులను శుక్రవారం సురక్షితంగా వారి వారి స్వస్థాలాలకు చేర్చారు. నేపాల్‌కు వెళ్లినవారిలో బద్వేలు పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన మారేళ్ల శ్రీనివాస్, వారి సతీమణి సుశీల దంపతులను బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. నేపాల్‌లో జరిగిన ఘటనను వారు రితేష్‌రెడ్డికి వివరించారు. అనంతరం రితేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగువారికి ఎక్కడ కష్టం వస్తే అక్కడ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనుమర్లపూటి ప్రసాద్, రాగిమాను ప్రతాప్‌కుమార్, శివయ్యస్వామి, సింగసాని విజయ్‌కుమార్, మస్తాన్ బాబు, వెంకటసుబ్బయ్య బెస్తమల సునీల్, లకిడి విజయ్ పాల్గొన్నారు.



నేపాల్ బాధితులను పరామర్శిస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కాచి చల్లార్చిన నీరు తాగాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా రక్షణ పొందేందుకు ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆమె సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగాయపల్లె గ్రామంలో కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకునే జాగ్రత్తలను వివరిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరంకేసులను పాలో చేపట్టారు. జ్వరపీడిత ప్రజలను అత్యవసర సమయాల్లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. మంచినీటి పైపులైను లీకేజీని గుర్తించి తక్షణమే పైపు లీకేజీని క్లియర్ చేయాలని సర్పంచుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు యశోధ, జాస్మిన్, హేమ, ఆశా కార్యకర్తలు నాగలక్ష్మి, బిందు, రంగమ్మ, అనసూయ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



నాగాయపల్లెలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డాక్టర్ గీత

దువ్వూరులో: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించి దోమలు ప్రబలుతాయని, ప్రజలు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు రోష్నీ పేర్కొన్నారు. దువ్వూరు మండలం సి.బయనపల్లి గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లవద్దకు వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కలుషిత నీరు తాగితే టైఫాయిడ్, కామెర్లు, గున్యా, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. కాచి చల్లార్చి వడబోసిన నీరు తాగాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయ అధికారి జనార్దన్‌రావు, సూపర్‌వైజర్ మల్లీశ్వరి, సీహెచ్‌వోలు నాగలక్ష్మి, సుధ, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.



ప్రజలకు సూచనలు ఇస్తున్న వైద్యురాలు రోష్నీ

బద్వేలుటౌన్‌లో : సీజనల్‌వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరాలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో సిబ్బంది కొరత, ఆసుపత్రిలోని సమస్యలు పరిష్కరిస్తామని అక్కడి అధికారులకు హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రైస్‌మిల్లు ప్రసాద్, బిగ్‌బాస్, ప్రతాప్‌కుమార్, జహంగీర్‌బాషా, మస్తాన్‌బాబు, సుధాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

రితేష్‌ను కలిసిన నూతన డైరెక్టర్: ఇదిలా ఉండగా బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా సుప్రజ, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాధనకారి రంతులు శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, చెరకూరి చెంద్రాయుడు, రాగిమాను ప్రతాప్‌కుమార్, రామక్రిష్టారెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో వెంకటరమణయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం ఉప మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. చిలమకూరులో విద్యుత్ స్తంభాలు వేయాలని ఐదేళ్లుగా కోరుతున్నా వేయడంలేదని ఎంపీటీసీ కొండయ్య ఆరోపించారు. రైతులకు డీఏపీ సకాలంలో అందించాలని చిన్నదండ్లూరు ఎంపీటీసీ కోరారు. చిలమకూరులో దోమల నివారణకు చర్యలు తీసుకోవడంలేదని మరో ఎంపీటీసీ కోరారు. డీఏపీ అవసరమైన రైతులు ముందస్తుగా తెలపాలని ఏవో సుజనకు మారి కోరారు. జడ్పీటీసీ బాలయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కోరారు. జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో శుక్రవారం కార్యకర్తలతో ఆయన బిజీగా గడిపారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె, మైలవరం ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వివిధ సమస్యలపై భూపేశ్‌రెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వారు అర్జీలు అందజేశారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న భూపేశ్

ఆర్థిక నేరాలపట్ల అప్రమత్తంగా ఉండండి

దువ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలపట్ల ప్రజలు అవగాహన ఏర్పరచుకుని అప్రమత్తంగా ఉండాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయహరి పేర్కొన్నారు. దువ్వూరు మండలం భీమునిపాడులో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక నేరాలు, అవగాహన అనే కార్యక్రమం నిర్వహించారు అనంతరం జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జనార్ధనం మాట్లాడుతూ అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని సూచించారు. సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పెరుగు కృష్ణయ్య, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు వేలం

బద్వేలు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బద్వేలు డిపో పరిధిలోని బద్వేలు, పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉన్న దుకాణాలకు 19వతేదీన వేలంపాట నిర్వహిస్తారని ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు టెండరు ఫారంలు బద్వేలు డిపోలో అందుబాటులో ఉంటుందన్నారు. పూర్తిచేసిన టెండరు ఫారాలను 19న మధ్యాహ్నం 2గంటల్లోపు జిల్లా పబ్లిక్ ట్రాన్స్ పోర్టు ఆఫీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయాలని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి టెండరుదారుల సమక్షంలో వేలంపాట ఉంటుందని తెలిపారు.